# లేఖ

తన బెయిల్ రద్దుచేసి సికిందరాబాద్ జైలులో వుంచమని వరవరరావు గారు కోర్టులో పిటిషన్ పెట్టుకున్న నాటినుండి ఆయన చర్యగురించి చాలా చర్చ జరుగుతోంది. అరుణతారలోనూ ఇతర పత్రికలలోనూ అచ్చు రూపంలో, నలుగురు కలుసుకునే చోట నోటిమాటల రూపంలో, ఈ చర్చ నడుస్తోంది. కొంతమంది ఆయనను పిరికివాడనీ భయపడ్డాడనీ అంటున్నారు. ప్రజలలో రక్షణ తీసుకోవాలి, జైలులో కాదంటున్నారు. కొందరు 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అని నిందిస్తున్నారు. కొందరు తత్వ విచారంలో నిమగ్నమయ్యారు. కొందరు పోలీసుల చేత అరెస్టు కాకుండ బెయిలు తీసుకోవడం గూడ సాధ్యమే ఆపని ఎందుకు చేయలేక పోయావని భారత న్యాయవ్యవస్థకు సంబంధించిన నిగూఢ రహస్యాన్ని విశదీకరిస్తున్నారు. గోవా తీరంలో స్మగ్లర్ల పడవ ఎక్కితే సౌదీ అరేబియాకు పోవచ్చు, అక్కడ ప్రవాస విప్లవ ప్రభుత్వం ఏర్పరచ లేకపోయినా, ముషీరాబాద్ జెయిల్లో ఏం సుఖం అన్న సలహా ఒక్కటే ఇప్పటి దాకా ఎవ్వరూ ఇవ్వంది.

అధివాస్తవికం (Surreal) గా సాగుతూన్న ఈ చర్చకు వాస్తవిక పునాదిని కల్పించడం నా నైతిక బాధ్యత అని నేను భావిస్తున్నాను. వరవరరావు గారితో నాలుగు సంవత్సరాలు సన్నిహితంగా వున్న వాడిని కావడం ఇలా భావించ డానికి గల ఒక కారణం. అంతకంటే ముఖ్యంగా, సికందరాబాద్ కుట్రకేసులో తన కున్న బెయిల్‌ను రద్దు చేసుకొని రిమాండుకు పోవడం తన సమస్యకు గల ఒక పరిష్కారం అని ఆయనకు మొట్టమొదట సలహాయిచ్చిన వాళ్ళలో నేను ఒకడిని. డాక్టర్ రామనాధంగారి హత్యవల్ల అనివార్యంగా వరంగల్ వదిలిన తరువాత నామీద వరంగల్ కోర్టులలో చార్జి షీటు పెట్టిన కేసులు నేను హైదరాబాద్ మెట్రోపాలిటన్ కోర్టుకు బదిలీ చేయించుకున్నాను. ఆ విధంగా వరంగల్ పోవలసిన అవసరం (తాత్కాలికంగా) లేకుండ చేసుకున్నాను. వరవరరావుగారు గూడ ఆపని చేసి ఉండ వచ్చును గాని, ఆయన మీద వరంగల్ కోర్టులలో వున్న 6 కేసులలో రెండు అప్పటికే విచారణ దశను చేరుకోవడంవల్ల అది కష్టం అయింది. విచారణ ప్రారంభం అయిన తరువాత కేసును ఒకరికోసం బదిలీ చేయడం సులభం కాదు. అంతే కాకుండ గత అక్టోబర్ నెలలోనే వరవరరావుగారి మీద వరంగల్‌లో నాన్ బెయిలబుల్... నాసా వారంట్ జారీ అయింది. నాసా వారంట్‌ను బదిలీ చేయడం సులభం కాదు. ఈ కారణంగా ఆయన

వరంగల్ కోర్టుకు హాజరు కావడం అనే 'రిస్కు' ను తప్పించుకోలేక పోయారు. ('రిస్కు' లేదని ఎవరయినా భావిస్తే, ఎ. పి. సి. ఎల్. సి. కార్యకర్త సీతారామ రావును గత అక్టోబర్‌లో పోలీసులు కాళ్ళూ చేతులూ విరగ్గొట్టిన ఉదంతం, ఈ సంవత్సరం జూలై 12 రాత్రి వరవరరావుగారి ఇంటిమీద దాడిచేసి తలుపును గొడ్డళ్ళతో విరగ్గొట్టిన ఉదంతం, గుర్తుచేస్తే సరిపోతుందనుకుంటాను) అయితే యాదృచ్ఛికంగా ఆయనకు హైదరాబాద్‌లో 12 సంవత్సరాల నాటి బెయిల్ ఉండడంవల్ల ఆ బెయిల్ రద్దు చేసుకొని సికిందరాబాద్ జైలుకు పోగల అవకాశం వుందని, ఆ విధంగా ఆయన తాత్కాలికంగా తన సమస్యను పరిష్కరించుకోగలరని మేము కొందరం ఆయనకు సలహా ఇచ్చాము. ఆయన మా సలహా వెంటనే తీసుకోలేదు. (పిరికివాడు కావడం వల్ల నేమో). కొన్ని నెలలు తటపటాయించిన మీదటే ఆపని చేసాడు. వరంగల్‌కు సంబంధించి ఇది కొత్త విషయంగూడ కాదు. రెండేళ్ళ క్రితం వెంకటాపురం, లేదెళ్ళ గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులు బెయిల్ తీసుకున్న తరువాత గూడ పోలీసులు నిత్యం అరెస్టుచేసి కొడుతుంటే భరించలేక బెయిల్ రద్దు చేసుకొని జైలుకు పోయారు. ఆనాడు వాళ్ళకు ఆ సలహా యిచ్చిన వాళ్ళలో గూడ నేను ఒకడిని. ఇటువంటి సలహా యివ్వడం పిరికితనాన్ని ప్రోత్సహించడం అని నాకప్పుడు తోచలేదు. ఇప్పటికీ అని పించడంలేదు. బహుశా నాలోనే ఎక్కడో భీరత్వం ఉండాలి.

దీనిని తాత్కాలిక పరిష్కారంగానే ఆయనయినా ఆయనకు సలహా యిచ్చిన వాళ్ళయినా భావించారు, భావిస్తున్నారు. వరవరరావుగారు వ్యవస్థ మారేదాకా జెయిల్లో వుండదల్చుకున్నాడని చాలామంది అనుకుంటున్నట్టున్నారు కాబట్టి ఈమాట అనవలసి వస్తోంది. తనమీద ప్రస్తుతం వరంగల్‌లో విచారణ జరుగుతున్న కేసులతో విచారణ పూర్తి అయ్యేదాకా, లేక కేసులు బదిలీ అయ్యేదాకా, ఆయన జెయిలులో వుండడం క్షేమం. అందుకు కావలసిన ప్రయత్నాలు ఆయన మిత్రులు చేస్తూనే వున్నారు.

ఈ విషయాలన్నీ అర్థం అయినప్పటికీ ఆయన చర్యను రాజకీయంగా విమర్శించే హక్కు అందరికీ వుంది. విమర్శించే వాళ్ళు ఆయన వ్యక్తిత్వానికి తగ్గ గౌరవం ఇస్తే బాగుండునని మాత్రం అనిపిస్తుంది. అదెట్లాగున్నా, వాస్తవాలతో నిమిత్తం లేకుండ విమర్శ సాగించడం అర్థరహితం.

హైదరాబాద్ — కె. బాలగోపాల్

11-8-86